క్లుప్తంగా

ప్రభుత్వ విప్‌ను కలిసిన ఇప్పపెల్లి గ్రామస్తులు



సమస్యలు వివరిస్తున్న బీసీ నాయకులు

కథలాపూర్: మండలంలోని ఇప్పపెల్లి గ్రామస్తులు ఆదివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను వేములవాడలో కలిసి పలు సమస్యలను విన్నవించారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. అభివృద్ధి పనులకు వీలైనంత త్వరగా నిధులు మంజూరు చేయాలని విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు



శస్త్ర చికిత్సల అనంతరం రోగులతో ఎమ్మెల్యే

జగిత్యాలటౌన్: జగిత్యాల పావని కంటి ఆస్పత్రిలో ఆపి, రోటరీక్లబ్ ఆధ్వర్యంలో జగిత్యాల నియోజకవర్గానికి చెందిన 11 మంది నిరుపేదలకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేసి మందులు, కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో పావని ఆస్పత్రి వైద్యులు డా విజయ్‌కుమార్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు వినియోగించుకోవాలి



శిక్షణ తరగతుల్లో మిషన్ భగీరథ అధికారులు

కోరుట్ల రూరల్: మంచినీటి సహాయకులకు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని మిషన్ భగీరథ ఈఈ రమేశ్ అన్నారు. ఆదివారం కోరుట్ల మండల పరిషత్ కార్యాలయంలో కథలాపూర్, కోరుట్ల మండలాల మంచినీటి సహాయకులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. గ్రామాల్లో పైపులైన్ మరమ్మతులు, బోరుబావుల మరమ్మతుల గురించి అవగాహన కల్పించారు. శిక్షణ తరగతుల్లో నేర్చుకున్నవాటిని గ్రామాల్లో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈ ఆనంద్, ఎంపీడీవోలు రామకృష్ణ, శంకర్, ఎంపీవో రాజశేఖర్, కృపాకర్,ఏఈచంద్రశేఖర్, అనిల్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ పరిసరాల్లో స్వచ్ఛతా హీ సేవ



రైల్వే స్టేషన్ వద్ద శుభ్రం చేస్తున్న యువకులు

కోరుట్లటౌన్: పట్టణంలోని రైల్వే స్టేషన్ పరిసరాల్లో మున్సిపల్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛత హీ సేవ నిర్వహించారు. పట్టణంలో అన్ని ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండేందుకు ప్రభుత్వం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం చేపట్టిందని మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి అన్నారు. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. చెత్తను తొలగించారు. యువకులు స్వచ్ఛందంగా సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ గోనెల మహేశ్, 35 మంది యువకులు పాల్గొన్నారు.

నిలిచిన మురికినీరు.. దుర్వాసనతో ఇబ్బంది



ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో దీప్తి ఇండెన్ గ్యాస్ కార్యాలయం వద్ద డ్రైయినేజీలో మురికినీరు నిల్వలు పేరుకుపోయి దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. డ్రైయినేజీనీరు వెళ్లే కల్వర్టు వద్ద చెత్త చెదారం పేరుకుపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని, కల్వర్టు వద్ద చెత్త పేరుకుపోకుండా ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పీహెచ్‌సీకి డాక్టర్లు కావలెను

- సిబ్బంది కొరతతో ఇబ్బందులు
- 24 గంటల వైద్యశాల.. 8 గంటలే పనివేళలు
- పట్టించుకోని అధికారులు



ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఇబ్రహీంపట్నం : గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు వైద్యులు వైద్య సేవలు అందించాల్సి ఉండగా సరిపడా వైద్య సిబ్బంది లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో డాక్టర్లు, సిబ్బంది లేకపోవడంతో రోగులకు వైద్య సేవలు అందించేవారే కరువయ్యారు.పీహెచ్‌సీలో 24 గంటల పాటు ఇద్దరు వైద్యులు వైద్య సేవలు అందించాల్సి ఉంది. ఇద్దరు డాక్టర్లకు గాను మెట్‌పల్లి మండలం మేడిపల్లి పల్లె దవాఖానకు చెందిన డిప్యూటేషన్ పై ఇబ్రహీంపట్నంకు ఇవ్వగా మరొక డాక్టర పోస్టు ఖాళీగా ఉంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు లేకపోవడంతో ఉదయం పూట 8 గంటలు మత్రమే రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. సాయంత్రం 5 నుంచి ఆస్పత్రికి తాళం వేస్తున్నారు. రాత్రి పూట ఎదైనా ప్రమాదం జరిగి అత్యవసరంగా అస్పత్రికి రావాల్సివస్తే ఆసుపత్రిలో ఎవరు ఉండక తాళం వేసి ఉంటుంది. ఈ ఆరోగ్య కేంద్రానికి ప్రతీ రోజు సుమారు 200 వరకు ఔట్‌పేషెంట్‌లు వస్తున్నారు. ఇటీవల సీజనల్ వ్యాదులు ప్రబలడంతో జ్వరాల బారిన పడి ఆసుపత్రికి వైద్యం కోసం రోగులు నిత్యం వస్తున్నారు. రక్త పరీక్షలు చేయించుకునేందుకు కాంట్రాక్ట్ బేసిక్ పై ల్యాబ్ టెక్నిషన్‌ను నియమించారు. ఆయన సెలవు పై వెళ్లడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవలే ఫార్మాసిస్ట్ బదిలీపై వెళ్లడంతో కాంట్రాక్ట్ బేసిక్‌పై ఫార్మాసిస్ట్‌ను నియమించారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కింద 17 గ్రామాలు ఉండగా 10 హెల్త్ సబ్ సెంటర్లు ఉన్నాయి.

ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది ఖాళీలు

ఇద్దరు డాక్టర్లు, 9 మంది మొదటి ఏఎన్‌ఎంలు, 1 ఆశా కార్యకర్త, 1 స్టాఫ్ నర్సు, 1 ఫార్మాసిస్ట్, 1 ల్యాబ్ టెక్నిషన్, 1 హెల్త్ అసిస్టెంట్, 2 స్వీపర్లు, 1 వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికైనా అదికారులు స్పందించి 24 గంటల ఆస్పత్రికి ఇద్దరు డాక్టర్లతో పాట సిబ్బందిని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సిబ్బంది కొరత



ఆరోగ్య కేంద్రంలో నిత్యం రోగులు పరీక్షల నిమిత్తం వస్తుండగా వైద్యాధికారులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ అనుపత్రి బంద్ ఉండడం వలన ఇబ్బంది పడాల్సివస్తుంది. వెంటనే సిబ్బందిని నియమించి 24 గంటలు వైద్య సేవలు అందించాలి.

– వి.గిరిదర్, ఇబ్రహీంపట్నం.

ల్యాబ్ టెక్నిషన్‌ను నియమించాలి



ఆరోగ్య కేంద్రంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నిషన్ సెలవుపై వెళ్లడంతో ప్రతిరోజు రక్త పరీక్షల కోసం వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు వెంటనే చొరవ చూపి పర్మినెంట్ ల్యాబ్ టెక్నిషన్ పోస్టును మంజూరు చేయాలి.

– లోలపు శ్రావణ్‌కుమార్, ఇబ్రహీంపట్నం.

నెల రోజుల్లో భర్తీ చేస్తాం

నెల రోజుల్లో కొత్త డాక్టర్ పోస్టులు వస్తాయి కాబట్టి డాక్టర్ పోస్టులను భర్తీ చేస్తాం. మిగితా ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు కొంత సమయం పట్టినా కృషి చేస్తాను. రోగులకు అందుబాటులో వైద్యం అందించేందుకు కృషి చేస్తాను.

– ఎండీ సమీయోద్దీన్, జిల్లా వైద్యాధికారి

క్రీడలతో ధైర్య సాహసాలు పెంపు



విజేతలకు బహుమతులు ఇస్తున్న నాయకులు

కోరుట్లటౌన్: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ధైర్యసాహసాలు పెంపొందుతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, డాక్టర్ నడికట్ల సంతోష్ కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని మినీ స్టేడియంలో జగిత్యాల జిల్లాస్థాయి పోటీలు ప్రారంభించారు. క్రీడలతో విద్యార్థుల్లో స్నేహభావం, మానసిక ఉల్లాసం పెరుగుతుందన్నారు. దేశ ప్రతిష్ఠ క్రీడాకారులు పెంచుతున్నారని కొనియాడారు. ఈ పోటీలతో గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాలు మెరుగుపడతాయని తెలిపారు. పరుగు పందెం 100మీ, 1500మీ, 200మీ,షాట్‌పుట్ 60మీ, 1000మీ, 1500మీ, కిడ్స్ జావలింగ్‌త్రో బాల బాలికలకు నిర్వహించారు. ఈ పోటీలకు 820 మంది క్రీడాకారులు హాజరయ్యారు. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ సెక్రటరీ ఏలేటి ముత్యంరెడ్డి, అన్నం అనిల్, జిందం లక్ష్మీనారాయణ, గుజ్జేటి వెంకటేష్, శ్రీనివాస్, వెంకటరెడ్డి గంగాధర్, ఆల్‌రౌండర్ గంగాధర్, పీఈటీలు, కోరుట్ల స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న కరస్పాండెంట్

జగిత్యాలటౌన్: పట్టణంలోని జ్యోతి హైస్కూల్‌కు చెందిన 9 వ తరగతి విద్యార్థిని కే.శ్రీనిధి రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ఐ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 28న కరీంనగర్‌లో జరిగిన 68వ ఎస్జీఎఫ్ఐ జోనల్ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన శ్రీనిధి వచ్చే నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగే 68వ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ హరిచరణ్‌రావు శ్రీనిధిని అభినందించారు. ఈ సందర్భంగా హరిచరణ్‌రావు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థిని రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీధర్‌రావు, మౌనికారావు,అజిత, రజిత, ఉపాధ్యాయ బృందంతో పాటు విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు భీమారం స్కూల్ విద్యార్థుల ఎంపిక

మేడిపల్లి: ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు భీమారం స్కూల్ విద్యార్థులు బండపల్లి అబిషేక్, బోయిని హర్షిత్, చిలువేరి రుచిత, పల్లికొండ కీర్తన, పుప్పాల రచన ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయులు పెసరి తిరుమలేశ్ తెలిపారు. జిల్లా స్థాయిలో భీమారం హైస్కూల్‌కి మంచిపేరు తెచ్చినందుకు ప్రధానోపాధ్యాయులు జవ్వాజి అశోక్ విద్యార్థులను అభినందించారు.

ఆర్‌ఆర్‌ఆర్‌లో ప్రజలంతా భాగస్వాములవ్వాలి

మెట్‌పల్లి: మున్సిపాలిటీలో అమలు చేస్తున్న రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్(ఆర్‌ఆర్‌ఆర్) కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములవ్వాలని కమిషనర్ మోహన్ కోరారు. ఆర్‌ఆర్‌ఆర్ కింద సేకరించిన సామగ్రిని ఆదివారం పేదలకు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇండ్లల్లో వాడని దుస్తులతో పాటు ఇతర వస్తువులు తిరిగి ఉపయోగించడానికి అవకాశముంటే వాటిని మున్సిపల్ సిబ్బందికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రవీణ్, రత్నాకర్, విష్ణు, ముజీబ్, నిజాం,అశోక్ ఉన్నారు.

రాయికల్‌లో ఉర్దూ భాష పరీక్ష పోటీలు

రాయికల్: పట్టణంలోని మదీనా మసీద్ ఆవరణలో ఆబిద్ అలీ ఖాన్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉర్దూ లాంగ్వేజ్ పరీక్షలను హాఫీస్ మొహమ్మద్ సద్దాం ఆధ్వర్యంలో హాఫీస్ మొహమ్మద్ మునవర్ వా హాఫీస్ అన్వర్ వా హాఫీస్ అబ్దుల్ రాహుఫ్ పర్యవేక్షణలో ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు ఉర్దూ భాషా పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సెంట్రల్ ముస్లిం కమిటీ అధ్యక్షులు మహమ్మద్ సోహెల్, మొహమ్మద్ షాకీర్ సెక్రటరీ ముజాహిద్ తబ్లీక్ జమాత్ అధ్యక్షులు మొహమ్మద్ సాబీర్ పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఆర్థికసాయం

జగిత్యాల రూరల్: కరీంనగర్ జిల్లా మానకొండూరుకు చెందిన కోంద్ర ప్రవర్ష, కల్యాణ్‌లకు జగిత్యాల పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు సూరజ్ శివశంకర్ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అనాథ చిన్నారులకు రూ.7,000 ఆర్థిక సాయం అందించారు. అంగడి బజార్‌కు చెందిన అలిశెట్టి గీతారాణి తన భర్త అలిశెట్టి లక్ష్మణ్ జ్ఞాపకార్థం చిన్నారులకు రూ.3,000 ఆర్థికసాయం అందించారు.

ఇబ్రహీంపట్నంలో భారీ వర్షం

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వర్షం కురియడంతో రోడ్లపై నీళ్లు పారాయి. కొత్త బస్టాండ్ వద్ద నీరు పారడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అక్కడక్కడ గుంతలు ఉండటం వల్ల వాహనాలపై వెళ్లేవారు ప్రమాదానికి గురైనట్లు స్థానికులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చి వేయించాలని కోరారు.

కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడిపై గాంధీభవన్ లో ఫిర్యాదు

మల్లాపూర్: జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్‌గౌడ్‌పై గాంధీభవన్‌లో రాష్ట్ర అధినాయకత్వానికి ఫిర్యాదు చేసినట్లు బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గోనే ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల ప్రక్రియ జరుగుతున్న కాంగ్రెస్ పార్టీపై ప్రతిపక్షాలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్న బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కనీసం స్పందించడం లేదన్నారు.

బైక్, కారు ఢీ ఇద్దరికి తీవ్ర గాయాలు

మల్యాల: బైక్‌ను వెనక నుంచి కారు ఢీకొన్న సంఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మల్యాల మండలం నూకపల్లి శివారులోని ఆదివారం రాత్రి మల్యాలకు చెందిన బొట్ల వంశీ, ఖయ్యూమ్ జగిత్యాల నుంచి బైక్‌పై మల్యాల వెళ్తుండగా, ద్విచక్ర వాహనాన్ని కారు వెనక నుండి ఢీకొని వెళ్లిపోయింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, స్థానికుల సమాచారం మేరకు 108 ఈఎంటీ జ్యోతి, పైలట్ అనిల్ కుమార్ క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించి, జగిత్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రైతులకు దుబ్బరాజన్న కోడెలు

సారంగాపూర్: దుబ్బరాజన్న పుణ్యక్షేత్రానికి భక్తులు సమర్పించిన కోడెలను రైతులు పెంచుకోవడానికి సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు డ్రా పద్ధతిలో కేటాయించనున్నట్లు ఆలయ ఈవో కోస్న కాంతారెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త పారండ్ల శంకరయ్య తెలిపారు. ఆలయ పరిధిలోని పెంబట్ల, కోనాపూర్, పోచంపేట గ్రామాల్లోని రైతులు, ఇతరులకు మాత్రమే డ్రాలో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు.

యువకుడికి అభినందన

పెగడపల్లి: మండలంలోని నందగిరి గ్రామానికి చెందిన పొన్నం ప్రణయ్‌కుమార్ టీజీపీఎస్సీ నిర్వహించిన ఏఈఈ పరీక్షలో రాష్ట్ర వ్యాప్తంగా 29వ ర్యాంక్ సాధించి ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఏఈఈగా ఉద్యోగం సాధించి నియామకపత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా మాజీ సర్పంచి గాజుల రాకేశ్, గంగ మల్లేశం, గ్రామస్తులు, మండల ప్రజలు అభినందించారు.

బాలసదన్‌కు చేరిన బాలిక

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బీష్మ నగర్ బాల సదన్ నుంచి అదృశ్యమైన బాలికను ఆదివారం బాలసదన్‌కు అప్పగించినట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు. ఈ నెల 27న సాయంత్రం బాల సదన్‌లో ఉంటున్న 17 ఏళ్ల బాలిక బాల సదన్ నుంచి అదృశ్యమైంది. దీంతో నిర్వాహకులు పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు బాలికను గుర్తించి, ఆదివారం బాలసదన్‌కు అప్పగించారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

కథలాపూర్: మండలకేంద్రంలో మేడిపెల్లికి చెందిన భాస్కర హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎముకల, కీళ్ల వైద్యనిపుణులు నాగార్జున్ ప్రజలకు చికిత్సలందించారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి నిర్వాహకులు గణేశ్, ప్రశాంత్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


ఎస్సై గా బాధ్యతలు స్వీకరణ



ఎస్సై సుధీర్ రావు

రాయికల్: మండల ఎస్సైగా సుధీర్ రావు ఆది వారం రాయికల్ పోలీస్ స్టేషన్లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రత పరిరక్షణ కోసం కృషి చేస్తానని, పట్టణ, మండల ప్రజలు సహకరించాలని కోరారు.

అబ్బురపరిచిన ఇంద్రధనస్సు



రాయికల్: పట్టణంలోని ఆదివారం సాయంత్రం కురిసిన వర్షం అనంతరం పట్టణంలో ఇంద్రధనస్సు వెలిసింది. పట్టణ ప్రజలు వీక్షించడంతోపాటు తమ సెల్‌ఫోన్ లో ఫొటోలు బంధించారు.



కథలాపూర్: మండలంలోని తుర్తి గ్రామశివారులో కల్వర్టు ఇటీవల కురిసి వర్షాలకు గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు తెలిపారు. ఈ కల్వర్టు గుండా వాహనాలు వెళ్లితే ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈ కల్వర్టు వద్ద రాత్రివేళల్లో వాహనాలు వెళ్లితే ప్రమాదానికి గురికావడం ఖాయమన్నారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు దృష్టిసారించి కల్వర్టును త్వరగా మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
జగదీశ్వర్, ఏఈ,పీఆర్ కథలాపూర్ సెల్: 9100853882

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

నియామకం

రైతు ఐక్య వేదిక నూతన కార్యవర్గం



తిరుపతి యాదవ్



ఉదిగిరి ఆదిరెడ్డి

మేడిపల్లి: మేడిపల్లి, భీమారం మండలాల రైతు ఐక్యవేదిక నూతన అధ్యక్షులను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మేడిపల్లి మండల అధ్యక్షుడిగా దమ్మన్నపేట గ్రామనికి చెందిన చిలివేరి తిరుపతి యాదవ్‌ను ఎన్నుకోగా, భీమారం మండల అధ్యక్షుడిగా కమ్మరిపేట గ్రామానికి చెందిన ఉదిగిరి ఆదిరెడ్డిని నియమించినట్లు జగిత్యాల జిల్లా రైతు ఐక్యవేదిక అధ్యక్షుడు నల్ల రమేష్ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా నూతన కార్యవర్గానికి సూచించారు. కార్యక్రమంలో రైతు ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మిట్టపల్లి తిరుపతిరెడ్డి, జిల్లా రైతు ఐక్యవేదిక నాయకులు వేముల కర్ణాకర్, పాల్గొన్నారు.

గౌడ సంఘం పట్టణ అధ్యక్షుడిగా శ్రీనివాస్



గౌడ సంఘం కార్యవర్గం

రాయికల్: రాయికల్ పట్టణ గౌడ సంఘం సంఘం అధ్యక్షుడిగా ఎనుగందుల శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా పొన్నం శ్రీకాంత్ గౌడ్, కోశాధికారిగా బండి ప్రవీణ్ గౌడ్ ఆదివారం ఎన్నికయ్యారు.కార్యక్రమంలో ఎన్నికల కమిటీ సభ్యులు మొగిలి పాక మహేశ్, కైరంస్వామి, పెగ్గర్ల నారాయణ, వల్ల కొండ మహేశ్, గుర్రం నరేశ్, బి శ్రీనివాస్ గౌడ్ తదితరులున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

బీర్‌పూర్ మండల పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా రవికుమార్



నూతన కార్యవర్గం

సారంగాపూర్: బీర్‌పూర్ మండల పద్మశాలీ సంఘం నూతన అధ్యక్షుడిగా ఆడెపు రవికుమార్ (తుంగూర్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ఆవరణలో జరిగిన పద్మశాలీ సంఘం సమావేశంలో ఎన్నిక కార్యక్రమం జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా మెరుగు రాజేశం (నర్సింహులపల్లె), ఉపాధ్యక్షులుగా చెట్‌పల్లి సత్యనారాయణ(బీర్‌పూర్),ఎనగందుల చంద్రశేఖర్ (కొల్వాయి), ప్రధాన కార్యదర్శిగా బోగ సత్తన్న (నర్సింహులపల్లె),కోశాధికారిగా మెరుగు గంగాధర్ (కండ్లపల్లి) ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా చెట్‌పల్లి శ్రీధర్, నరిమెట్ల సతీష్, కడారి ప్రకాశ్, ఆడెపు వెంకటేష్, ఆడెపు జగదీష్, తుపాకుల రాజు, ఎనగందుల మహేష్, మెరుగు రాజమౌళి, శ్యామల రాజు, చెనన గంగన్న (ఆటో) ఎన్నికయ్యారు. కార్యవర్గంను పలువురు అభినందించారు.

క్రైం కార్నర్..

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన సిరిగిరి పద్మ అమె భర్త సాయిలుపై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన గడ్డం జలపతి, గడ్డం లక్ష్మిలపై శనివారం రాత్రి కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. కన్నాపూర్ గ్రామానికి చెందిన సిరిగిరి పద్మ కు అతని తమ్ముడు గడ్డం జలపతి మధ్య గత కొంతకాలంగా కుంటుబ గొడవలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో శనివారం పద్మ ఆమె భర్త సాయిలు కొడుకు అంజి ఇంటికి తాగు నీటి కోసం గ్రామ పంచాయతీ నల్లా కనెక్షన్ కోసం ఇంటి పక్క నుంచి గుంత తవ్వతుండగా జలపతి,అతని భార్య లక్ష్మి ఎందుకు గుంత తవ్వతున్నారని సాయిలు, పద్మపై దాడి చేశారు. దీంతో బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ ఆదివారం తెలిపారు.

చంపుతామని బెదిరించిన ఐదుగురిపై కేసు

సారంగాపూర్: మండలంలోని రేచపల్లి గ్రామంలో డబ్బుల విషయంలో ఏర్పడ్డ వివాదంలో దాడి చేసి చంపుతామని బెదిరించిన ఐదుగురు వ్యక్తులపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం రేచపల్లి గ్రామానికి చెందిన తాటి జగన్‌కు మల్యాల రాయమల్లు, మద్రి గంగన్న, మల్యాల మల్లవ్వ, మద్రి రాజవ్వ, సాంబ మానసలతో వివాదం నెలకొంది. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని ఈ ఐదుగురు కలిసి జగన్, జగన్ భార్య తాటి నీరజలను అసభ్యపద జాలంతో దూషిస్తూ, నీరజను కట్టెతో కొట్టడంతో నీరజకు బలమైన గాయాలయ్యాయి. జగన్ ఫిర్యాదు మేరకు నిందితులైన రాయమల్లు, గంగన్న, మలవ్వ, రాజవ్వ, మానసలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సత్యనారాయణస్వామి ఆలయంలో చోరీకి యత్నం

కథలాపూర్: మండలంలోని కలిగోట శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో ఓ వ్యక్తి దొంగతనానికి యత్నించినట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. ఆలయంలో ఉన్న హుండీని ఎత్తుకెళ్లి ఆలయం వెనుకవైపు పడేశారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆలయంలో శనివారం రాత్రి ఓ వ్యక్తి దొంగతనానికి ప్రయత్నిస్తున్నట్లు అక్కడున్న సీసీ పుటేజీల్లో కనిపించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.